

రోశయ్యగారు అరమరికలులేని మనిషి. బనీనూ, దానిమీద చొక్కా, దానిమీద కోటూలేసినా వారికి హృదయం దాచుకోవటం అంటే ఏమిటో తెలియదనుకొంటాను.

# మారని చిత్తశుద్ధి

## శ్రీ ఏలూరిపాటి అనంతరామయ్య

నేను పందొమ్మిదివందల డెబ్బైలో గుంటూరు రాక పూర్వం బహుశః శ్రీరోశయ్యగారి పేరు పత్రికల వార్తలలో చదివి ఉంటాను. ఎందుకంటే వారు నాకు ఎన్నడూ అపరిచితులనిపించ లేదు.

బహుశః వారిని మొదటి సారిగా చూచింది సాహితీ సదస్సులోనో, డాక్టరు సదాశివరావుగారి ఇంట్లోనో ఇప్పుడు సరిగా జ్ఞాపకం లేదు కాని, ఏదో సాహిత్య సభలోనే అని మాత్రం బాగాగుర్తు ఉన్నది.

గతం జ్ఞాపకం తెచ్చుకుంటే వారు ప్రసిద్ధులైన జె.కె.సి. కళాశాల ప్రిన్సిపాలుగారని, ఆంగ్లంలో అఖండ పండితులనీ, సహృదయులనీ, నాపట్ల ఎందుకో వాత్సల్యం కలవారనీ, మొదటిసారి నేను అనుకొన్నట్లు నాకు అనిపిస్తున్నది.

### ప్రిన్సిపాల్ సమావేశాలు

తరువాత, తరువాత గుంటూరులోని అనేక సాహితీ సభలలోను, అప్పటికి మా కళాశాలలన్నీ ఆంధ్ర విశ్వవిద్యాలయానికి అను బంధింపబడి ఉండేవి

కనుకనూ అపుడు అన్ని కళాశాల ప్రిన్సిపాల్స్ ఆ విశ్వవిద్యాలయపు అకాడమిక్ కౌన్సిల్లో సభ్యులముగా ఉండేవారం కనుకనూ, వాల్తేరు ప్రయాణాలలోనూ, ఆ కౌన్సిల్ సమావేశాలలోనూ, కలిసే వారం, ఆ ప్రయాణాలలో విశేషం ఏమిటంటే గుంటూరు నుంచి సాయంకాలం నాలుగు గంటల బండిలోవెళ్ళి జనతా ఎక్స్‌ప్రెస్ అందుకోవడంకోసం విజయవాడ రైల్వే స్టేషనులో ఐదు గంటలనుంచి ఏడు గంటల వరకూ గడిపేవారం. గుంటూరు వారమే కాని, కృష్ణాజిల్లా ప్రిన్సిపాల్స్‌కూడా కొందరు మాతో కలిసినా ఆ రెండు గంటలూ ప్రధానంగా గుంటూరు ప్రిన్సిపాల్స్ సమావేశాలుగానే గడిపేవారం. అందరిలోకి చిన్నవాణ్ణీ, క్రొత్తవాణ్ణీ అయినా, రోశయ్యగారితో సహా అందరూ నన్ను కనీసం సమానమైన వాడన్నట్టుగా చూసేవారు. రోశయ్యగారు ప్రత్యేకత వహించేవారు.

## గాఢాతిగాఢ కరచాలనం

రోశయ్యగారు అన్నమాట జ్ఞాపకం వచ్చేసరికి తకీమని ముందు జ్ఞాపకం వచ్చేది, వారి గాఢాతిగాఢ కరచాలనం. అందులోనూ వారి వాత్సల్యానికి మిక్కిలి నోచుకొన్న నావంటివాడికే అలా అనిపిస్తుందో, ఏమోకాని, అది నిజంగా మరచిపోలేని కరచాలనమే. వారి కరచాలన విధానం వారి స్వభావాన్ని పట్టి ఇస్తుందని వారి పరిచయంవల్ల నాకు అనిపిస్తూ ఉంటుంది.

రోశయ్యగారు అరమరికలులేని మనిషి. బనీనూ, దానిమీద చొక్కా, దానిమీద కోటూలేసినా వారికి హృదయం దాచుకోవటం అంటే ఏమిటో తెలియదనుకొంటాను. ఆయన అనుకునేదేదో మనస్సులో చాలా స్పష్టంగా అనుకొంటారు. ఆ అనుకొంటున్నది వీలైనంత విస్పష్టంగా-అంత అక్కరలేదేమో అని-ఆస్వభావం తెలియనివారికి అనిపించేటంత అతిస్పష్టంగా-పైకి అంటారు. ఆ ప్రకారం చేసి తీరుతారని వేరే చెప్పనక్కర లేదనుకొంటాను.

## గాఢం-అగూఢం

వారికి చాలా విషయాల్లో ఖచ్చితమైన అభిప్రాయాలు ఉన్నాయి. వాటిని చెప్పటానికి ఆయన ఎట్టి పరిస్థితుల్లోనూ అవసరం ఉన్నా లేక పోయినాకూడా సందేహించే తరహా అని నాకు ఎన్నడూ అనిపించలేదు. కనుక ఆయన ఇష్టమైనా, అనిష్టమైనా ఎంత గాఢంగా ఉంటుందో అంత అగూఢంగా ఉంటుంది. అందువల్ల ఆయన ఇష్టంలేని వారితో కరచాలనం చేయనే చేయరు. చేశారంటే ఆ ఇష్టంలోని గాఢత్వం ఏమిటో కనిపిస్తుంది.

## ఆంధ్రభాషా పాండిత్యం

వారి తరువాత పరిచయంలో వారిని గురించి నేను గ్రహించింది వారికిగల ఆంధ్రభాషా పాండిత్యం. అదేపనిగా తెలుగు సాహిత్య రంగంలో కృషి చేస్తున్నామనుకొనే వారుకూడా ''అలాగా!'' అనుకొనవలసిన సంగతులు ఎన్నో వారికి తెలుసు. వారిది పల్లవగ్రాహి పాండిత్యంకాదు, వేదం వెంకటరాయశాస్త్రిగారి వ్యాఖ్యానాలు, తిరుపతి వెంకట కవులు, పానుగంటివారు, రామకృష్ణ కవులు-వారేమిటి, వీరేమిటి, ఆంధ్ర సాహిత్యంలో పలుకువున్న ప్రతికవీ, ప్రతి పండితుడూ వ్రాసిన, జ్ఞాపకం ఉంచుకోవలసిన చాలా విషయాలు -పుటలకు- పుటలు-వారికి జిహ్వాగ్రంలో ఉంటాయి. చిన్నయసూరిపేరు తమ కుమారునికి పెట్టుకొనటంతో తృప్తిపడక పాఠశాలకు కూడా పెట్టారుకదా.

వారి అభిరుచులు గాఢపాకంలో ఉన్నవికాని, పూత మెరుగులూ కావు, లేత తణుకులూకావు. అది ఆంధ్రమైనా ఆంగ్లమైనా.

ఆంగ్ల కళాశాలలకు చలన చిత్ర నటులూ, విరివిగా నటీమణులూ మాత్రమే ఉపన్యాసాలు ఇవ్వటానికి ఆహ్వానింపబడుతున్న రోజులలో వారు దువ్వూరి వెంకటరమణశాస్త్రిగారు, వెంపరాల సూర్యనారాయణశాస్త్రి గారు వంటి పండితులను ఆహ్వానించి ప్రసంగింపజేసి, ఇప్పుడు తెలియకపోయినా, తరువాతి జీవితంలో ఈ

విద్యార్థులు ''అట్టివారిని దర్శింపగలిగాం, వినగలిగాం'' అని తృప్తిపడే అవకాశం కలిగించారంటే వారి లక్షణం ఏమిటో మనం తెలిసికోవచ్చు.

జె.కె.సి. కళాశాలకు వారు మొదటి ప్రిన్సిపాలు కావటం దాని అదృష్టం అని నేను అనుకొంటూ ఉంటాను. మిగిలిన మంచి విషయములన్నీ అలా ఉండగా, వారు గ్రంథాలయం విషయంలో చాలా శ్రద్ధచూపించారనీ, ఎన్నో అమూల్య గ్రంథాలను ఎక్కడెక్కడినుంచో తెప్పించారనీ విన్నాను.

రోశయ్యగారిలో నాకు ఆశ్చర్యం కల్పించిన మరొక లక్షణం ఏమిటంటే, వారి లోకజ్ఞత. ముఖ్యంగా బ్రాహ్మణులను గురించిన వారి పరిజ్ఞానం. బ్రాహ్మణులలో ఏ ఇంటిపేరు చెప్పినా తక్కున వారు వారిది ఫలానా గోత్రం, ఫలానాశాఖ, అని చెప్పటం నాకు బాగా తెలుసు.

## లోకజ్ఞత

నాకు ఆశ్చర్యం కలిగించిన మరొక లక్షణం వారి అభినివేశ నైశిత్యం, వారికి గ్రాంధిక భాష అంటే చాలా ఇష్టం. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వ్యవహారిక భాషను పరీక్షామాధ్యమంగా ప్రవేశ పెట్టాలనే విషయమై తర్జన భర్జనలు జరిగినపుడు వారు గ్రాంథికం పక్షాననే ఉన్నారు. నామనస్సులో గ్రాంథికం ద్వేషం లేక పోలేదు కానీ వ్యవహారం పట్లనే ఉన్నది. మా గురువులు కేళిరాజు వేంకట నరసింహ అప్పారావుగారు గ్రాంథిక పక్షాన అగ్రశ్రేణిలో ఉన్నారు. సభ్యులు అకారాది క్రమంలో కూర్చుంటారు కనుక గురుశిష్యులం మేము ఒకరి ప్రక్కన ఒకరం ఉండేవారంకూడా. కనుకనూ నేను గ్రాంథికం పక్షాన మాట్లాడే ప్రశ్న ఎటూలేదు. అధికసంఖ్యాకులు ఎటూ వ్యవహారికం వైపు ఉన్నారు. కనుకనూ నేను ఆ చర్చలలో ఎన్నడూ పాల్గొనలేదు. వ్యావహారికానికి అనుకూలంగా చివరి నిర్ణయం జరిగినసభ గుంటూరులో జరగటం విశేషం దానికి నేను కొంచెం ఆలస్యంగా వెళ్ళినందువల్ల రోశయ్యగారి ప్రక్కన కూర్చున్నాను. వారు చివరి వరకూ విమర్శిస్తూనే ఉన్నారు. లేచి

ప్రసంగించటం కాదు, నాతోమాట్లాడుతూ నేను వ్యావహారికాన్ని సమర్థిస్తూ మాటాడక పోయినా, గ్రాంధికాన్ని సమర్థించనందుకూ, సమర్థిస్తూ మాటాడనందుకూ వారు నన్ను క్షమించలేదు. ఆతరువాత ఒకసారి అలవాటుకొద్దీ, నాతో కరచాలనం తానే చేయబోయి, చెయ్యి వెనక్కి తీసికొని ''మీరు అస్పృశ్యులు'' అని వేళ్ళు గిట్టగరిచారు. వారికి నా మీదగల వాత్సల్యమూ, వారి అభినివేశ నైశిత్యమూ, నాకు తెలుసుగనక నేను ఎన్నడూ వారిని గురించి మరోలా అనుకోలేదు. అవకాశవాదం తప్ప అసలేచిత్తశుద్ధి కనపడని ఈ రోజుల్లో, ఇటువంటి మనస్సుగల వారిని ఎరిగిన వాడెవడుమాత్రం ఇంకోలా అనుకొంటాడు?

ఎవ్వరికి అక్కరలేని మన సంస్కృతి సంప్రదాయాలన్నీ ఎంతో ఆధునికులైన, రాయిస్ట్ అయిన రోశయ్యగారికి చాలా చక్కని అవగాహన ఉన్నది. అత్యంతప్రీతి ఉన్నది.

చిత్తశుద్ధి గలవాడిని చిత్రంగాచూసే ఈ రోజుల్లోదాన్ని పట్టుకుని వ్రేళ్ళాడిన రోశయ్యగారు కష్టపడ్డారో, నష్టపడ్డారో ఆయన మిత్రులకు తెలుసు. అయినా అదృష్టంకొద్దీ ఆయన మారలేదు. అయినా ఆయన నాణెమయిన మారని మనిషేకాని, మారని నాణెంకాదు.



1986, మనుమరాలు బాలచంద్రిక జన్మదిన సందర్భములో